క్లుప్తంగా

సైబర్‌నేరాలపై అవగాహనకు చర్యలు



సాయిసందీప్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

ఏలేశ్వరం: ప్రజల్లో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు స్పార్క్ చైర్మన్ సాయిసందీప్ తెలిపారు. కాకినాడలో మంగళవారం ఆయన కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి హ్యాక్ ఫ్రీ సైబర్ ప్రోలాక్ సైన్సు అండ్ టెక్నాలజీ ఇంక్యుబేటర్ కాన్సెప్ట్‌పై చర్చించారు. ఈ సందర్భంగా సాయిసందీప్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా సైబర్ నేరాల నుంచి ప్రజలను కాపాడవచ్చాన్నారు. ప్రజల్లో సైబర్‌నేరాలపై అవగాహనతో పాటు రక్షణ ఉంటుందన్నారు. అనంతరం సాయిసందీప్, స్పార్క్ సీఈఓ ప్రదీప్‌ను ప్రశంస పత్రాలతో కలెక్టర్ షణ్మోహన్ సత్కరించారు.

ఉత్తమ లైన్‌మన్‌గా సింహాచలం



అధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న లైన్‌మన్ సింహాచలం

ఏలేశ్వరం: యర్రవరం గ్రామంలో పనిచేస్తున్న లైన్‌మన్ కుంచే సింహాచలం ఉత్తమ లైన్‌మన్‌గా అవార్డు అందుకున్నారు. లైన్స్‌మన్స్ డే సందర్భంగా జగ్గంపేట డివిజన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఈ వీరభద్రరావు, అసిస్టెంట్ డీఈ రాజశేఖరం, ఏఈ సూర్యనారాయణ చేతులమీదుగా సింహాచలం అవార్డు అందుకున్నాడు. వారు మాట్లాడుతూ ఉత్తమసేవలకు గాను ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీలో రాణిస్తున్న పేద విద్యార్థిని



క్రీడాకారిణి భవాని

జగ్గంపేట: గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన పాలిక భవాని కబడ్డీలో రాణిస్తోంది. భవాని రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో గుర్తింపు కోసం కృషి చేస్తోంది. వివిధ ప్రాంతాల్లో జరిగిన స్కూల్ గేమ్స్‌లో అండర్–17, అండర్–19 పోటీల్లో సత్తా చాటి మెడల్స్, సర్టిఫికెట్లను సాధించింది. జగ్గంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆమె ఇంటర్ సెంకడియర్ చదువుతోంది. భవిష్యత్‌లో జరిగే రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటానని భవాని చెబుతోంది. తండ్రి పాలిక అప్పారావు అందిస్తున్న ప్రోత్సాహంతోనే కబడ్డీలో విజయాలు సాధించినట్లు ఆమె తెలిపింది.

ఆదర్శలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన ఆదర్శ విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

గోకవరం: కొత్తపల్లి గ్రామంలో ఆదర్శ ఫార్మసీ కళాశాలలో మంగళవారం బీఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. సినర్జీ ఫార్మాస్యూటికల్ కంపెనీ ప్రతినిధులు చరణ్, రవితేజ, నవీన్‌లు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 19 మంది విద్యార్థులు ఎంపికయ్యారని విద్యార్థులకు యేడాదికి రూ.2.34 లక్షలు వేతనం అందుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాథరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను చైర్మన్ పి.కనకరాజు, సెక్రటరీ నాగమణి, డైరెక్టర్లు హారిక, ప్రవల్లిక, కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ఫలసాయం వేలం వాయిదా

కొత్తపల్లి: వాకతిప్పలోని నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకంలో ఉన్న ఫలసాయం వేలంను వాయిదా వేసినట్టు జిల్లా పరిషత్ రెవెన్యూ ఆఫీసర్ కే శ్రీనివాస్ తెలిపారు. నాగులాపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రక్షిత మంచినీటి పథకంలో ఉన్న 22 కొబ్బరి చెట్లు, 8 మామిడి చెట్లకు వేలం పాట నిర్వహించారు. అయితే నిర్ణయించిన కనిష్ట ధర రూ.44 వేలకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పాటను వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

పన్నులు.. చెల్లిస్తేనే అభివృద్ధి

- మొండి బకాయిలతో ఆర్థిక ఇబ్బందులు
- మున్సిపాలిటీకి రూ.4 కోట్ల బకాయిలు
- ఇందులో రూ.కోటి ప్రభుత్వ కార్యాలయాలు
- తలలు పట్టుకున్న అధికారులు



రూ.34.57 లక్షల బకాయి పడిన తుని గాంధీ సత్రం సముదాయం

తుని: అన్ని రకాల సేవలు అందాలంటే ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించాలి. పన్నులు వసూలు కాక పనుల జరగక అభివృద్ధి అంతంతమాత్రంగా ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్నులను జమ చేయాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా తుని పురపాలక సంఘం పరిధిలో బకాయిల చిట్టా చాంతాడులా పెరుకుపోతోంది. దీంతో అధికారుల సైతం తలలు పట్టుకుంటున్నారు. గ్రేడు–2 మున్సిపాలిటీ పరిధిలోనే ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ. కోటి బకాయి ఉంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ కార్యాలయాలు ఉన్నాయి. రెండు నెలల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది. బకాయిలను వసూలు చేసేందుకు అన్ని శాఖలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. దీంతో పాటు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పన్నుల వసూళ్లలో అలసత్వం వహించిన రెవెన్యూ సిబ్బంది, అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఇదీ పరిస్థితి

తుని పురపాలక సంఘానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్ను ద్వారా ఏటా రూ.8 కోట్ల మేర డిమాండ్ ఉంది. ఇందులో ఏటా 50 శాతం మేర మాత్రమే అధికారులు వసూలు చేస్తున్నారు. మిగిలిన 50 శాతంలో 25 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు ఉన్నాయి. తర్వాత స్థానంలో ఇంటి కుళాయిలకు సంబంధించి బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వ పరంగా ఇచ్చే నిధులు అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తున్నారు. కొన్ని అత్యవసర పనులకు పురపాలక సంఘం జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చు చేయాల్సి ఉంది. ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. అధికారం యంత్రాంగం కాళ్లు అరిగేలా తిరిగినా పన్నులు వసూలు కాని పరిస్థితులు నెలకొన్నాయి. బడా బాబులకు సంబంధించిన బకాయిలు ఎక్కువగా ఉన్నా అధికారులు నోరు మెదపలేక సతమతమవుతున్నారు. మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

మున్సిపాలిటీ ఆదాయ వివరాలు

పన్ను	డిమాండ్ రూ.కోట్లు	వసూలు రూ.కోట్లు	బకాయిలు రూ.కోట్లు
ఆస్తి పన్ను	5.87	2.94	2.16
ఖాళీ స్థలాలు	1.68	0.30	0.76
నీటి పన్ను	1.79	0.52	1.27

ప్రభుత్వ కార్యాలయాల బకాయిల వివరాలు

కార్యాలయం పేరు	పన్ను బకాయి రూ.లక్షల్లో
గాంధీ సత్రం	34,57,511
పోలీస్ శాఖ	41,07,721
గృహ నిర్మాణం	12,633
రోడ్లు,భవనాలశాఖ	1,30,198
రెవెన్యూశాఖ	12,71,008
అగ్నిమాపక	16,783
వ్యవసాయశాఖ	2,94,356
ఐసీడీఎస్	47,825
సబ్ జైలు	1,90,329
ఎంపీడీవో	6,33,477
ఎంఈవో	58,027
కోర్టు సముదాయం	1,28,015
పాండు రంగా దేవస్థానం	37,959
మొత్తం బకాయిలు	1,09,86,042

బకాయిలు వసూళ్లకు చర్యలు

పురపాలక సంఘం పరిధిలో పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు చర్యలు చేపట్టాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన కార్యాలయాలు, ప్రైవేటు యాజమానులకు నోటీసలు జారీ చేశాం. ఈ నెల 31 వరకు సమయం ఇచ్చాం. అప్పటికి స్పందించక పోతే కుళాయి పన్నుకు సంబంధించి బకాయిదారుల కుళాయి కనెక్షన్ తొలగిస్తాం. ప్రజలు పట్టణాభివృద్ధిలో సహకరించాలి.

– వెంకట్రావు, కమిషనర్, తుని

జగ్గంపేట పార్సిల్ ఆఫీసులో తనిఖీలు



తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

జగ్గంపేట: స్థానిక పార్సిల్ సర్వీస్ ఆఫీసులను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పార్సిల్ ఆఫీసులో అనుమానంగా ఉన్న పార్శిల్స్‌లో ఉన్న సామగ్రిని పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం పార్సిల్ ఆఫీసులో పేలుళ్ల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు తొండంగి మండలం గోర్సపాలెం గ్రామానికి చెందిన యనమల అప్పారావు స్థానిక మినర్వా సమీపంలో సరుగుడు తోటలో కూలిపనికి వచ్చాడు. తిరిగి స్వగ్రామం వెళ్ళేందుకు జాతీయ రహదారిని దాటుతుండగా తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన యనమల అప్పారావు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతనిని చికిత్స కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వర్క్ ఫ్రం హోం సర్వేకు సహకరించండి



తాళ్లూరులో వర్క్‌ఫ్రమ్ హోం సర్వే చేస్తున్న కార్యదర్శి ఎస్వీ రమణ

తుని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఐటీ, ఇతర ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న సర్వేకు సంబంధిత ఉద్యోగులు, తల్లిదండ్రులు సహకరించాలని ఎంపీడీఓ కె.సాయి నవీన్ కోరారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో ప్రారంభించిన ఈ సర్వే వారం రోజుల పాటు ఇంటింటా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సర్వే ఆధారంగా స్వగ్రామంలోనే ఉంటూ వర్క్‌ఫ్రం హోం అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకు అవసరమైన మౌలిక వసతులు ఇళ్ల వద్ద ఉన్నాయో లేదో ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన లభిస్తుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగినవారికి వర్క్‌ఫ్రమ్ హోం సర్వే చేస్తున్నట్టు పేర్కొన్నారు. హౌస్ హోల్డ్ ఆధారంగా సర్వే జరుగుతుందన్నారు. అవసరమైనవారికి నైపుణ్య శిక్షణ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందుకు వివరాలు ఇచ్చి సర్వేకు సహకరించాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: మండలంలోని అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం, గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో యర్రయ్యపేట, పైడికొండ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌లైన్లు మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఈనేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అద్దరిపేట, వేమవరం, యర్రయ్యపేట, పైడికొండ గ్రామాలకు బుధ, గురు వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

కూటమి ప్రభుత్వం కొందరికి మాత్రమే



విలేకరులతో మాట్లాడుతున్న రఘురాం

జగ్గంపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలన కేవలం కొందరి సంక్షేమం కోసమే ఏర్పడిందన్న నిజాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తన వాఖ్యల ద్వారా తెలిపారని జిల్లా వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నేతలను, పార్టీ అభిమానులను పట్టించుకోవద్దని రాజ్యాంగ విరుద్ధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడిన తీరుపై జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ నేతలు స్పందించాలని అన్నారు. లేని పక్షంలో వారు కూడా రాజ్యాంగాన్ని అవమానించిన వారవుతారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గాని, జగన్ మోహన్‌రెడ్డి కాని పార్టీలకు అతీతంగా అందరికి సంక్షేమ అందాలన్న లక్ష్యంతో పనిచేశారని అన్నారు. చంద్రబాబు తీరు దీనికి పూర్తి విరుద్ధంగా ఉందని విమర్శించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అందరివాడులా కాకుండా కొందరివాడిలా పరిపాలన చేయలేదని తెలిపారు.

మురికికూపంగా రహదారులు



జగన్నాథపురంలో రోడ్డుపై చేరిన మురుగునీరు

కోటనందూరు: జగన్నాథపురంలో రహదారులు మురికికూపాలుగా మారాయి. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. రోడ్లపై చేరిన మురుగునీరు రోజులు తరబడి నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతూ అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. రోడ్లపై చేరిన మురుగునీటితో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ మురుగుమయంగా మారినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రమణక్కపేట ఎస్సీ పేటకు చెందిన తాతపూడి విజయ్(24) తొండంగి మండలంలో అరబిందో ఫార్మాలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా పిఠాపురం వైపు నుంచి వస్తున్న బొలెరో వ్యాన్ రమణక్కపేట సమీపంలో ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయ్‌ను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రత్తిపాడు: మాజీ డీసీసీబీ డైరెక్టర్ వరుపుల రాజా ద్వితీయ వర్ధంతిని టీడీపీ నేతలు మంగళవారం నిర్వహించారు. వరుపుల రాజా స్వగ్రామైన పెదశంకర్లపూడిలో ఆయన సమాధి వద్ద ఆయన సతీమణి, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నివాళులర్పించారు. ప్రత్తిపాడులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వరుపుల రాజా విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

ప్రత్తిపాడు రూరల్: గజ్జనపూడి గ్రామంలో దివంగత డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక టీడీపీ నాయకుడు దాకారపు కృష్ణ, స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 150 మందికి కంటి వైద్య సేవలు అందించారు.

ఏలేశ్వరం: పట్టణంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపులరాజా ద్వితీయ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జెడ్పీటీసీ పెదబాబు, సూతిబూరయ్య పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం



గోకవరంలో సత్యనారాయణస్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన రమాసత్యనారాయణస్వామి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నదానం జరిగింది. ఆలయంలో కొలువై ఉన్న ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి శివరాత్రి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సుమారు 6 వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 21 రకాల పిండి వంటలతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాస్‌రావు రూ.2 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకుపోయిన ఆటో



బోల్తా పడిన ఆటో

కిర్లంపూడి: అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయిన ఘటన సోమరాయణంపేట శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. పాలెం నుంచి బూరుగుపూడి వైపు వేగంగా వెళుతున్న ఆటో డ్రైవర్ ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించే సమయంలో కాలువలోకి దూసుకుపోయింది. ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలైయ్యాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. దీంతో స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.

సంపద కేంద్రాల పరిశీలన

తొండంగి: గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను డీఎల్పీఓ బాలామణి మంగళవారం పరిశీలించారు. తొండంగి, ఎ.కొత్తపల్లి, బెండపూడి తదితర గ్రామాల్లో పర్యటించి వాటి నిర్వహణపై శానిటరీ సిబ్బందితో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఘనంగా బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం



మునసబు గారి రామాలయం వద్ద వేడుక జరుపుకొంటున్న నాయకులు

ప్రత్తిపాడు: భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఆవిర్భావ దినోత్సవం ప్రత్తిపాడు మునసబు గారి రామాలయం ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీకేఎస్ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి యల్లపు సూర్యనారాయణ పతాకాన్ని ఆవిష్కరించారు. బీకేఎస్ వ్యవస్థాపకుడు దత్తోపంత్ ఠేంగ్డిజీ, భారతమాత, బలరాముని చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా అధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో భేరి రాము, శింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



ర్యాలీలో పాల్గొన్న పూర్ణిమ

కిర్లంపూడి: సమాజంలో మహిళల పాత్ర కీలకమని, అన్ని రంగాల్లోను రాణిస్తున్నారని జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల మహిళా సమాఖ్య సమావేశపు హాలులో మంగళవారం ×ఆరోగ్యవంతమమైన మహిళా, ఆనందమైన మహిళా¤ అనే ప్రోగాన్ని ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, తహసీల్దార్ జె.చిరంజీవి, ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ, ఎంఈఓ–1 టి.జోషఫ్, ఏపీఎం ఎస్.వేదకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి అన్ని రంగాల్లోనూ ప్రభుత్వాల అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు అందించే తోడ్పాటును అందుపుచ్చుకుని మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు కృషి చేయాలని తెలిపారు. సమాజంలో మహిళలకు ఉన్న హక్కులపై వారికి అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీలు పి.సాయిరమ్య, పి.నిర్మల మహిళల ఆరోగ్య సమస్యలను అధిక మించేందుకు పలు సలహాలు అందజేశారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అదే కార్యలయంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ ఫుడ్ స్టాల్స్‌ను వారు సందర్శించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉన్నారు.

అపరాల సాగుతో భూమికి బలం



జెడ్ రాగంపేటలో మాట్లాడుతున్న ఏఓ, రైతులు

గండేపల్లి: అపరాల సాగుతో భూమికి బలం చేకూరుతుందని ఏఓ సద్గురుమూర్తి తెలిపారు. మండలంలోని తాళ్లూరు, జెడ్ రాగంపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడురూ రైతులందరూ రబీ పంటలో కోత అనంతరం పచ్చిరొట్ట పైరులు, అపరాలు సాగు చేయాలన్నారు. దీనివల్ల భూమికి బలం చేకూరుతుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు 6390 మంది రైతులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించుకున్నారని మిగిలిన రైతులు త్వరితగతిన నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చంద్రమౌళి, విఏఏ పృధ్వి, సురేఖ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీట్, జేఈఈ పుస్తకాల బహూకరణ



ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న శ్రీప్రకాష్ అధ్యాపకులు

తుని రూరల్: దాతల ప్రోత్సాహంతో నీట్, జేఈఈ పుస్తకాలను ఇంటర్మీడియట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హంసవరం ఏపీ ఆదర్శ విద్యాలయం (మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల) ప్రిన్సిపాల్ పుల్లా పద్మజ అన్నారు. మంగళవారం పాయకరావుపేట శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భానుమూర్తి, అధ్యాపకులు రామ్‌కుమార్ నీట్, జేఈఈ పుస్తకాలను ఏపీ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు అందజేశారు.

భద్రతా ప్రమాణాలతోనే ఉద్యోగులకు రక్షణ

తొండంగి: పారిశ్రామిక సంస్థల్లో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ఉద్యోగులు రక్షణ పొందుతారని జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్, అగ్నిమాపక అధికారి పి.వి.సాయి రాజేష్ అన్నారు. మంగళవారం ఒంటిమామిడి దివీస్ ల్యాబోరేటరీస్‌లో 54 జాతీయ భద్రతావారోత్సవాల్లో భాగంగా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, శ్రామికులు సంస్థ ఏర్పాటు చేసిన భద్రతా పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణ సమయంలో కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు అవగాహన శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా భద్రతాపరికరాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సాయిరాజేష్ ప్రారంభించి, పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దివీస్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎల్వీ రమణ, జనరల్ మేనేజర్ వి.నాగేశ్వర్, సీనియర్ మేనేజర్ సతీష్‌కుమార్, బి.వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్‌లెట్లు తగ్గితే ప్రమాదకరం

శంఖవరం: మనిషిలో ప్లేట్‌లెట్లు తగ్గి పోతే ప్రమాదకరమని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. కొత్తూరులో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదు. లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం,వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నోడల్ సంస్థగా ఆదిత్య యూనివర్సిటీ



వివారాలు వెల్లడిస్తున్న యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నోడల్ సంస్థగా ఎంపికైనట్టు యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్–2025 నోడల్ సంస్థగా ఎంపిక కావడం ఆయన హర్షం వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామ రాజు, యానాం జిల్లాల స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్–2025 నిర్వహించడానికి నోడల్ సంస్థగా ఆదిత్య యూనివర్సిటీని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిన వారు 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులని, సెల్: 7729990278, 9000156734 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్, తదితరులు అభినందనలు తెలిపారు.